ఉద్యోగంతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటాలి

రాచకొండ సీపీ సుధీర్‌బాబు

సిటీబ్యూరో, జనవరి 8(నమస్తే తెలంగాణ): ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ, క్రీడల్లో ప్రావీణ్యం ఉన్న వాళ్లు తమ ప్రత్యేక ప్రతిభను ప్రదర్శిస్తూ పతకాలు సాధించి రాచకొండ కమిషనరేట్‌కు మంచిపేరు తీసుకురావాలని పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఆకాంక్షించారు. వియత్నంలో గత ఏడాది డిసెంబర్ 6 నుంచి 9వ తేదీ వరకు జరిగిన 2024 ఆసియా ఓపెన్ పోలీస్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ సంజీవ్‌కుమార్ అండర్-34 కేటగిరిలో తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించాడు. ఈ పోటీల్లో సుమారు 30 దేశాల నుంచి 2500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కాంస్య పతకం పొందిన సంజీవ్‌కుమార్ బుధవారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనర్ కార్యాలయంలో సీపీ సుధీర్‌బాబును కలిశాడు. ఈ సందర్భంగా సీపీ సంజీవ్‌కుమార్‌ను అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

వేలానికి 1087 వాహనాలు

అభ్యంతరాలుంటే దరఖాస్తు చేయండి : సీపీ సీవీ ఆనంద్

సిటీబ్యూరో, జనవరి 8(నమస్తే తెలంగాణ): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ కారణాలతో పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాల్లో క్లెయిమ్ చేయని 1087 వాహనాలను బహిరంగ వేలం వేయనున్నట్లు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. ఈ వాహనాల వేలానికి ఎవరికైనా అభ్యంతరం ఉంటే వారి యాజమాన్య, హైపోథికేషన్ సంబంధించిన పత్రాలతో బంజారాహిల్స్‌లోని కమిషనరేట్ కార్యాలయంలో ఈ ప్రకటన వెలువడిన ఆరు నెలల లోపు దరఖాస్తు చేయాలని సూచించారు. వాహనాలు అంబర్‌పేట్‌లోని సీపీఎల్ పోలీస్ గ్రౌండ్‌లో ఉన్నాయని, వివరాలకు హైదరాబాద్ పోలీస్.జీవోవీ.ఇన్ అధికారిక వెబ్‌సైట్‌లోనూ పరిశీలించుకోవచ్చని సీపీ సూచించారు.

లగచర్ల కేసులో సురేశ్‌కు.. మరో ఇద్దరికి బెయిల్

రూ.50వేల చొప్పున ఇద్దరి పూచీకత్తులు సమర్పించాలి

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జనవరి 8 (నమస్తే తెలంగాణ): వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల రైతులపై బొంరాస్‌పేట్ పోలీసులు నమోదు చేసిన కేసులో రెండో నిందితుడిగా ఉన్న బొగమోని సురేశ్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ పీడీపీపీ ప్రత్యేక కోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రూ.50వేల చొప్పున ఇద్దరి పూచీకత్తులను కోర్టుకు సమర్పించాలని ఇన్‌చార్జి ఏసీబీ కోర్టు జడ్జి అప్రోజ్ ఆదేశాలు జారీ చేశారు. ప్రతి సోమ, శనివారం సబ్ డివిజనల్ పోలీసు ఆఫీసర్ తాండూర్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి 1 గంటలోపు సంతకం చేయాల్సి ఉంటుందని సూచించారు. మూడు నెలలపాటు ఎస్‌డీపీఓ అధికారి ఎదుట విచారణకు సహకరించాలని తెలిపారు. నిందితుడు పాస్‌పోర్టు కలిగి ఉన్నట్లైతే కోర్టుకు జమ చేయాలని పేర్కొన్నారు. 50 రోజులపాటు రిమాండ్ ఖైదీగా చంచల్‌గూడ జైలులో ఉన్న ముద్దాయి తరపు న్యాయవాది ఏకాంబరం చేసిన వాదనలను ఏకీభవించిన కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు మంగ్యానాయక్, బుగ్గప్పలకు సైతం బెయిల్ మంజూరు చేసింది. వీరిద్దరూ రూ.20వేల చొప్పున ఇద్దరి పూచీకత్తులను కోర్టుకు జమ చేయాలని, ప్రతి బుధవారం ఎస్‌డీపీఓ అధికారి తాండూర్ ఎదుట హాజరుకావాలని తెలిపింది. ఫార్మాసిటీ కోసం భూములు గుంజుకునేందుకు ప్రభుత్వం.. లగచర్ల రైతులపై వేర్వేరు కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. క్రైం.నం.145లో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పోలీసుల విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో మరో 10మంది రైతులకు తెలంగాణ హైకోర్టు ముందస్తు బెయిల్ జారీ చేసినప్పటికీ బొంరాస్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో జమానత్‌లను సమర్పించేందుకు వెళ్లకపోవడం విశేషం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కేసులోనూ రైతులను అక్రమంగా పోలీసులు అరెస్టు చేస్తారనే భయంతో బిక్కుబిక్కుమంటున్నారు.

చెరువులకు శాస్త్రీయ హద్దులు

- హైడ్రా కమిషనర్ రంగనాథ్
- చెరువు ఎఫ్‌టీఎల్ పెరిగిందంటూ స్థానికుల ఫిర్యాదు
- మాసబ్ చెరువు సందర్శించిన హైడ్రా బృందం

తుర్కయంజాల్ మాసబ్ చెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

సిటీబ్యూరో/తుర్కయంజాల్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): ఓఆర్ఆర్ పరిధిలోని కొన్ని చెరువులు ఆక్రమణలతో మాయమైతే.. మరికొన్ని చెరువుల ఎఫ్‌టీఎల్ తూములను మూసేయడంతో పెరిగిందని, ఈ వ్యవహారంలో తమకు అనేక ఫిర్యాదులొస్తున్నాయని, రెండుమూడు నెలల్లో శాస్త్రీయ పద్ధతిలో చెరువుల హద్దులను నిర్ధారిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా తుర్కయాంజల్ మున్సిపాలిటీ పరిధిలోని మాసబ్ చెరువు, జిలావర్‌ఖాన్ చెరువుల హద్దులకు సంబంధించి 'ప్రజావాణి'లో వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో బుధవారం రంగనాథ్ తన బృందంతో కలిసి ఈ రెండు చెరువులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువుల తూములను మూసేసి అలుగు పెంచడంతో పైభాగంలో ఉన్న పంట పొలాలు, ఇండ్లు నీట మునుగుతున్నాయని స్థానికులు హైడ్రాకు ఫిర్యాదులిచ్చారు. ఈ నేపథ్యంలో చెరువులను సందర్శించిన రంగనాథ్ స్థానికుల నుంచి వివరాలు తీసుకున్నారు. ఎన్నార్ఎస్సీ ఇమేజీలు, గ్రామాలకు చెందిన మ్యాప్స్‌ను పరిశీలించి రెండు మూడునెలల్లో శాస్త్రీయ పద్ధతుల్లో మాసబ్‌చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారిస్తామని, ఆక్రమణలపై నిష్పక్షపాతంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. మాసబ్ చెరువును అనుకొని ఉన్న సర్వే నంబర్ 205లోని 12 ఎకరాల భూమికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆదిత్యనగర్ కాలనీలోని నిర్మాణాలను పరిశీలించి కాలనీ వాసులతో మాట్లాడారు. మాసబ్ చెరువులోకి మురుగునీరు వచ్చి చేరుతున్నదని, ఆ నీరు కిందకు పోవడంలేదని వారు కమిషనర్‌కు చెప్పారు. ఈ చెరువుపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించామని, వీటిపై ఇరిగేషన్ ఇంజినీర్లు, రెవెన్యూ అధికారులతో చర్చిస్తామని ఆ తర్వాత ఐఐటీ, బిట్స్ పిలానీ, జేఎన్‌టీయూ విద్యాలయాల ఇంజినీరింగ్ నిపుణులతో అధ్యయనం చేయిస్తామని చెప్పారు. తుర్కయాంజల్ చెరువు విస్తరణ 495 ఎకరాల్లో ఉందని, మొత్తం విస్తీర్ణం 522 ఎకరాలని.. ఇలా పలు రకాలుగా మ్యాపులు, రికార్డుల్లో ఉన్న లెక్కలను పరిగణనలోకి తీసుకుని ఒక నిర్ధారణకు వస్తామని తెలిపారు. అనంతరం అదే ప్రాంతంలో ఉన్న సర్వే నెంబర్ 137లో చెరువు శిఖం భూమిని కబ్జా చేస్తూ వేసిన మట్టి రోడ్డును రంగనాథ్ పరిశీలించారు. అదే విధముగా జిలావర్ ఖాన్ చెరువును పరిశీలించిన ఆయన ఇంజాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. మాసబ్ చెరువు, జిలావర్ ఖాన్ చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల సర్వే చేసి 3 నెలల్లో నిర్ధారణ చేస్తామని ఆయన తెలిపారు. ఈ పర్యటనలో కమిషనర్ వెంట హైడ్రా అడిషనల్ డైరెక్టర్ పాపయ్య, తహసీల్దార్ హేమ మాలిని, ఇరిగేషన్ డీఈ చెన్నకేశవ రెడ్డి, ఏఈ వంశీ, అబ్దుల్లాపూర్‌మెట్ తాహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి, డీఈ భిక్షపతి, సర్వేయర్ జ్యోతి ఉన్నారు.

మా ఇండ్లను కూల్చొద్దు సార్..

సరిత, ఆదిత్యనగర్‌కాలనీ వాసి

చెరువు ఎఫ్‌టీఎల్ పెరగడంతో తమ కాలనీలోకి నీళ్లు వస్తున్నాయని, తాము స్థలం తీసుకున్నప్పుడు ఈ సమస్య లేదని కాలనీ వాసి సరిత హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు చెప్పారు. తూములు తెరిచి తమ సమస్యను తీర్చాలని, అయితే ఈ సందర్భంలో హైడ్రా అంటే తమకు భయమైతున్నదని, తమ ఇండ్లను మాత్రం కూల్చొద్దంటూ కోరారు. చెరువులోకి చేరే మురుగునీరుతో తమకు సమస్యలు వస్తున్నాయని, తమ ఇండ్లల్లోకి నీరు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హైడ్రా వస్తున్నదంటే తమ ఇండ్లకు ఏమవుతుందోనన్న భయం ఉందని, తూములు తెరిపించి నీరు కిందకు పోయేలా చేసి తమ ఇండ్లకు వరద ముప్పు లేకుండా చూడాలని ఆమె రంగనాథ్‌ను కోరారు.

ఏక పక్షంగా భూములు తీసుకుంటే ఊరుకోం..

- అధికారులతో ఫోర్త్ సిటీ రైతులు
- తిరిగి సమావేశం నిర్వహిస్తాం : ఆర్డీఓ

కందుకూరు, జనవరి 8:మండల పరిధిలోని బేగరికంచె సమీపంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఫోర్త్ సిటీకి రోడ్డు సౌకర్యం కల్పిస్తున్నారు. దీనిలో భాగంగా లేమూరులో భూములు కోల్పోతున్న రైతులతో ఆర్డీఓ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. లేమూరు రెవెన్యూ పరిధిలోని 497మంది రైతులకు గాను 84.28 ఎకరాలు భూమిని సేకరించడానికి గ్రామ రైతులను ఆహ్వానించారు. సమావేశానికి 10 మంది రైతులు కూడా రాకపోవడం, సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉండటం పట్ల రైతులు, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు గంగాపురం లక్ష్మీనర్సింహ రెడ్డి, లేమూరు మాజీ సర్పంచ్ ఢిల్లి గణేశ్‌లు కల్పించుకొని రైతులు లేని సమావేశం ఎందుకు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. కనీసం పట్టుమని 10మంది రైతులు లేకపోవడం పట్ల వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. రైతులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని, సమావేశం నిర్వహించవద్దని పట్టుబట్టారు. ఏకపక్షంగా సమావేశం నిర్వహించి భూములు లాక్కుంటే ఊరుకోమని హెచ్చరించారు. దీంతో ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి కల్పించుకోని రైతులందరికి సమాచారం ఇచ్చి మరోమారు సమావేశం నిర్వహిస్తామని సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రావడం పట్ల వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మాజీ సర్పంచ్ ఈర్లపల్లి భూపాల్‌రెడ్డి, జంగారెడ్డి, శ్రీధర్, పాండురంగారెడ్డి, క్రిష్ణానాయక్, విష్ణువర్ధన్‌రెడ్డి, తహసీల్దారు గోపాల్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో హైడ్రా బృందం పర్యటన

సిటీబ్యూరో: 'హైడ్రా ప్రజావాణి' ఈనెల 6వ తేదీ వచ్చిన ఫిర్యాదులపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంబంధిత అధికారులతో కలిసి బుధవారం పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఫిర్యాదుదారులను నేరుగా కలిసి క్షేత్రస్థాయిలో ఏం జరిగిందని తెలుసుకున్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని దివ్యనగర్ లేఅవుట్, సుప్రభాత్ టౌన్, పిర్జాదిగూడ మున్సిపాలిటీలోని సాయిప్రియాకాలనీ మధ్య రాకపోకలను అంతరాయం కలిగిస్తున్నారనే ఫిర్యాదులపై కాలనీ వాసులతో మాట్లాడి గేట్లు తెరిపించారు. కొన్ని ఫిర్యాదులపై ఇరుపక్షాలను కార్యాలయానికి సంబంధిత పత్రాలతో రావాలంటూ సూచించారు. మేడిపల్లి వెస్ట్ కామ్లనగర్ కాలనీలో పార్కు ఆక్రమణ, రహదారికి అడ్డంగా వినాయక మండపం ఏర్పాటు చేసి గేట్లు పెట్టడంపై విచారించిన కమిషనర్ గేట్లకు తాళాలు వేయొద్దని సూచించారు. ఆ తర్వాత పార్కు స్థలంలో ఇళ్ల నిర్మాణంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బార్‌లో యువతుల నృత్యాలు.. కేసు

అమీర్‌పేట, జనవరి 8: మద్యం తాగేందుకు వచ్చే వారి నుంచి అధిక మొత్తంలో డబ్బులు దండుకునేందుకు నిబంధనలకు విరుద్ధంగా యువతులతో నృత్యాలు చేయిస్తున్నారన్న సమాచారం మేరకు బాలానగర్ ఎస్‌వోటీ పోలీసులు దాడులు చేశారు. సనత్‌నగర్ పీఎస్ పరిధిలోని లక్ష్మీకళ థియేటర్ సమీపంలోని ఎవర్‌గ్రీన్ బార్‌లో ఎటువంటి వినోదం అనుమతులు లేకుండా యువతులతో నృత్యాలు చేయిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్‌వోటీ పోలీసులు మంగళవారం రాత్రి దాడులు నిర్వహించి 10 మంది యువతులను, 10 మంది బార్ సిబ్బందిని అదుపులోకి తీసుకుని సనత్‌నగర్ పీఎస్‌కు తరలించారు. యువతులతో అశ్లీల నృత్యాలు చేయిస్తూ మందుబాబులను రెచ్చగొడుతూ ఎక్కువ మొత్తంలో డబ్బులు దండుకుంటున్నారనే ఫిర్యాదు మేరకు బార్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి, తదుపరి దర్యాప్తు కోసం వారిని సనత్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

గుడి మల్కాపూర్‌లో ఒకరి హత్య

కార్వాన్, జనవరి8: గుడి మల్కాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకరు హత్యకు గురయ్యారు. ఇన్‌స్పెక్టర్ భైరి రాజు తెలిపిన ప్రకారం.. అరుణ్(35) అనే వ్యక్తి గత రెండు నెలల కిందట భోజగుట్ట వివేకానందనగర్‌కు వచ్చి కూలీ పనులు చేసుకుంటూ భార్య, ముగ్గురు పిల్లలతో జీవిస్తున్నాడు. ఇదిలా ఉండగా.. బుధవారం తెల్లవారుజామున అతడు హత్యకు గురయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు మృతుడి ఒంటిపై ఉన్న గాయాలు పరిశీలించి సాక్ష్యాధారాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కాగా, ఈ హత్య ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు మృతుడు అరుణ్‌కు మద్యం తాగించి మత్తులో ఉండగా గొంతు నులిమి చంపినట్లు మృతుడి ఒంటిపై ఉన్న గాయాలను బట్టి తెలుస్తున్నట్లు పోలీసులు తెలిపారు. హత్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

జర్నలిస్ట్‌ను హత్య చేసినవారిని శిక్షించాలి

సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

హిమాయత్‌నగర్, జనవరి 8: ఛత్తీస్‌గఢ్‌లో జర్నలిస్ట్ ముఖేశ్ చంద్రాకర్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్ నారాయణరావు డిమాండ్ చేశారు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏపీ డబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఎన్ఏజే రాష్ట్ర కార్యదర్శి కొండయ్యతో కలిసి వారు మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్ బస్తర్‌లో చేపట్టిన ఓ రోడ్డు నిర్మాణ పనుల్లో భారీ అవినీతి జరిగిందనే విషయాన్ని వెలుగులోకి తెచ్చినందుకు జర్నలిస్ట్ ముఖేశ్‌ను కాంట్రాక్టర్ సురేశ్ చంద్రాకర్ ఘోరంగా హత్య చేయించారని ఆరోపించారు. ముఖేశ్ హత్యకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఛత్తీస్‌గఢ్‌లో జర్నలిస్టుల రక్షణ చట్టం-2023 అమల్లో ఉన్నప్పటికీ ఆచరణలో నిర్వీర్యం అవుతున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణలోనూ జర్నలిస్టుల రక్షణ చట్టం తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆశ చూపారు.. రూ.12లక్షలు లాగారు..

జాబ్, బిజినెస్ పేరుతో సైబర్‌చీటర్స్ మోసం

సిటీబ్యూరో, జనవరి 8(నమస్తే తెలంగాణ): ఓ మహిళ సెల్‌ఫోన్‌కు పార్ట్‌టైమ్ ఉద్యోగమంటూ వాట్సాప్ మెసేజ్ వచ్చింది. ఆ మెసేజ్‌కు స్పందించిన బాధితురాలు సైబర్‌నేరగాళ్ల చేతికి చిక్కి రూ.12లక్షలు పోగొట్టుకున్నది. 3ఐ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నుంచి మెసేజ్ చేస్తున్నామని, వర్క్‌ఫ్రమ్ హోమ్‌కు అవకాశముందని అందులో పేర్కొన్నారు. దీంతో బాధితురాలు అందులో ఉన్న సెల్ నంబర్‌కు కాల్ చేసింది. అనంతరం గూగుల్ మ్యాప్స్‌ను ఓపెన్ చేసి 'ది పీచ్ డోర్' అనే పేరుతో రెస్టారెంట్‌ను క్లిక్ చేయాలని, అందులో రివ్యూ రాసి, 5 స్టార్స్ ఇచ్చి పోస్టు చేయాలంటూ సైబర్ చీటర్స్ ఓ లింక్‌ను పంపించారు. ఆ తరువాత స్క్రీన్ షాట్ పంపిస్తే రూ.200 ఇస్తామంటూ ఆ డబ్బులు ఫోన్ పే ద్వారా పంపించారు. ఆ తరువాత రూ.3వేలు చెల్లించండి.. మీకు అదనంగా డబ్బులు వస్తాయంటూ నమ్మించారు. వారి మాటలు నమ్మిన బాధితురాలు రూ.3వేలు పంపించడంతో రూ.3880 తిరిగి ఆమె ఖాతాలోకి వచ్చాయి. దీంతో బాధితురాలికి వారిపై నమ్మకం కుదిరింది. ఆ తరువాత రూ.7వేలు డిపాజిట్ చేయించుకొని, రూ.8400 పంపిస్తామంటూ నమ్మించారు. అయితే టెక్నికల్ సమస్యలతో ఆ డబ్బు తిరిగి పంపించలేకపోతున్నామని నమ్మించారు.

ఆశ చూపారు.. బిజినెస్‌లోకి లాగారు..

ఆ తర్వాత ఆమె మైండ్‌ను డైవర్ట్ చేసి ట్రేడింగ్ బిజినెస్‌లోకి లాగి బాధితురాలి నంబర్‌ను 'డాటా క్లిక్ 700-బి' అనే టెలిగ్రామ్ గ్రూప్‌లో యాడ్ చేశారు. అనంతరం 'యూ కాయిన్ సంస్థ'కు చెందిన కాయిన్ బిట్స్‌మై అనే యాప్ లింక్‌ను పంపించి అందులో షేర్స్ పెట్టుబడి పెడితే భారీ లాభాలొస్తాయంటూ నమ్మించి రూ.11.92 లక్షలు పెట్టుబడి పెట్టించి ఆమెను మోసం చేశారు. బాధితురాలు ఫిర్యాదుతో సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయానికి యత్నం.. ఇద్దరి అరెస్ట్

సిటీబ్యూరో, జనవరి 8(నమస్తే తెలంగాణ): ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి తెచ్చి విక్రయించేందుకు ప్రయత్నించిన ఇద్దరు గంజాయి స్మగ్లర్లను సౌత్ ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఒడిశాకు చెందిన విజయ్ టాక్రి స్థానికంగా బోలు అనే వ్యక్తి వద్ద ఈనెల 2వ తేదీన కిలో రూ.15 వేల చొప్పున 9 కిలోల గంజాయిని కొనుగోలు చేశాడు. దానిని తీసుకొని హైదరాబాద్‌లో ఉంటున్న తన స్నేహితుడైన బిస్వచందర్ మజ్ఝి వద్దకు 4వ తేదీన వచ్చాడు. ఇద్దరు కలిసి బండ్లగూడలోని సదాత్‌నగర్‌లోని ఐఎస్ఎల్ కాలేజీ వద్ద గంజాయిని విక్రయించేందుకు ప్లాన్ చేస్తుండగా.. టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 9 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ప్రేమజంటకు బ్లాక్ మెయిల్.. యువకుడి రిమాండ్

ముంత మహేశ్

ఘట్‌కేసర్, జనవరి 8: ప్రేమ జంటను బ్లాక్ బెయిల్ చేసి వారి ఆత్మహత్యకు కారణమైన ఓ యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ పి.పరశురాం తెలిపిన ప్రకారం.. ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధి ఘనాపూర్ సమీపంలోని ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డు వద్ద మక్తకు చెందిన చింతపట్టి నరేందర్ కూతురు(16), పర్వతం శ్రీరామ్(26)లు ఈనెల 6వ తేదీన ఎట్టిగా వాహనంలో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. వీరి బ్లాక్ మెయిల్ ఆత్మహత్యకు కారణమైన పోచారం మున్సిపాలిటీ మక్త గ్రామానికి చెందిన ముంత మల్లయ్య కుమారుడు డిగ్రీ విద్యార్థి ముంత మహేశ్ అలియాస్ చింటు(22)ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా అతడిని జ్యుడిషియల్ రిమాండ్‌కు చర్లపల్లి జైలుకు తరలించినట్లు చెప్పారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

గంజాయి చాక్లెట్లు, నిందితుడితో పోలీసులు

రూ.10కి గంజాయి చాక్లెట్

మేడ్చల్, జనవరి 8: తూంకుంట మున్సిపాలిటీలోని ఓ పాన్ షాప్‌లో గంజాయి చాక్లెట్లు లభించడం కలకలం సృష్టించింది. జిల్లా టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ పోలీసులతో కలిసి విశ్వసనీయ సమాచారం మేరకు తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని పాన్‌షాప్‌లో దాడి నిర్వహించారు. ఈ దాడిలో 85 ప్యాకెట్ల గంజాయి చాక్లెట్లు లభించాయి. పోలీసుల విచారణలో బీహార్‌కు చెందిన ఉపేందర్ మండల్ పాన్‌షాప్‌లో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఒక్కో ప్యాకెట్ ధర రూ.25 కొనుగోలు చేసి.. ఒక్కో చాక్లెట్‌ను రూ.10 విక్రయిస్తున్నట్లు తేలింది. గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకొని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం

కొండాపూర్, జనవరి 8: మాదాపూర్ దుర్గంచెరువు సమీపంలోని క్రిష్ణ కిచెన్ రెస్టారెంట్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అక్కడికి చేరుకున్న మాదాపూర్ ఫైర్ స్టేషన్ అధికారులు, సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. రెస్టారెంట్‌లో ఏర్పాటు చేసిన ఏసీలో షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించినట్లు ఫైర్ అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం జరగలేదని, సుమారు రూ.20లక్షల ఆస్తి నష్టం మాత్రమే జరిగినట్లు అధికారులు అంచనా వేశారు.

బ్రేక్‌లు ఫెయిలై.. దూసుకొచ్చిన కారు

కారులోని ముగ్గురికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం

శంషాబాద్ రూరల్, జనవరి 8: ఓ కారుకు బ్రేకులు ఫెయిల్ అయి రోడ్డు పక్కకు దూసుకుపోయిన ఘటన బుధవారం శంషాబాద్ మండలంలోని ఒయాసిస్ పాఠశాల వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన కారు డ్రైవర్ ప్రకాశ్, యోగేశ్వర్, అమర్నాథ్ అనే ముగ్గురు కలిసి (టీజీ 09ఏ 5004) కారులో శంషాబాద్ బైపు నుంచి నర్కూడ బైపు వెళ్తుండగా ఒయాసిస్ పాఠశాల సమీపంలోకి రాగానే బ్రేకులు ఫెయిల్ అయి అదుపు తప్పి రోడ్డు పక్కన చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. దీంతో కారులో ఉన్న వారికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది గాయపడిన వారిని వెంటనే శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా, మిగతా ఇద్దరికి స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. కారు బోల్తాపడిన సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు వివరించారు.

తాత మరణం తట్టుకోలేక..మనవడు

మనోహర్(ఫైల్)

కుత్బుల్లాపూర్, జనవరి 8: తనకు ఇష్టమైన తాత ఇటీవల మరణించడంతో పాటు తన ఉద్యోగం కూడా పోవడంతో తీవ్ర మనోవేదనకు గురైన ఓ యువకుడు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం... కొంపల్లి మున్సిపాలిటీ శివాలయం సమీపంలో ఉన్న సిరిగాధ మనోహర్(27) ఇటీవల తాను చేసే ప్రైవేట్ ఉద్యోగం పోవడంతోపాటు ఇష్టమైన తాత మృతి చెందాడు. దీంతో మనస్తాపంతో ఈనెల 7న రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో ప్రైవేట్ హెల్పర్ మృతి

దుర్గాంకుమార్ మృతదేహం

కుత్బుల్లాపూర్, జనవరి 8: విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా.. అనుమానాస్పద స్థితిలో ఓ ప్రైవేట్ హెల్పర్ మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకున్నది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన ప్రకారం... ఆదిలాబాద్ జిల్లా చెన్నూరు మండలంలోని దొబ్బగూడెం గ్రామానికి చెందిన దుర్గంకుమార్(30) గత కొద్ది నెలల కిందట నగరానికి వలస వచ్చాడు. విద్యుత్ విభాగంలో ప్రైవేట్ హెల్పర్‌గా పని చేస్తున్నాడు. అయితే రోజువారీ పనిలో భాగంగా బుధవారం మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో విద్యుత్ మరమ్మతులో భాగంగా చెట్ల కొమ్మలు తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. కాగా, చెట్ల కొమ్మలను తొలగించిన అనంతరం తిరిగి వైర్లకు ఏదో అడ్డు వచ్చిందని, దానిని తొలగించే క్రమంలో ఒక్కసారిగా కిందకు వేలాడుతూ కనిపించాడు. అక్కడే విధుల్లో ఉన్న విద్యుత్ అధికారి, తోటి వర్కర్లు గమనించి దుర్గంకుమార్‌ను క్రేన్ సాయంతో కిందకు దింపారు. కానీ అప్పటికి కరెంటు సరఫరా కాలేదని చెబుతున్న